సాక్షి
ఖమ్మం

శనివారం । 4 । నవంబర్ । 2023



వేగంగా.. సులభంగా

పోలింగ్ కేంద్రాల సమాచారం తెలుసుకోవడంతో ఫిర్యాదులు చేసేందుకు ఎన్నికల సంఘం పలు యాప్‌లను ప్రవేశపెట్టింది. IIలో



ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

హ్యాండ్‌బాల్, టేబుల్‌టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. IIలో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 23°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం, రాత్రి చలి ప్రభావం పెరిగే అవకాశముంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

నామినేషన్లు షురూ!

ఎన్నికల సమరంలో కీలకమైన నామినేషన్ల ఘట్టానికి తెర లేచింది. తొలిరోజైన శుక్రవారం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో బోణీ అయింది. వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో మాత్రం దాఖలు కాలేదు. ఈనెల 10వరకు నామినేషన్ల దాఖలు గడువు ఉండడంతో కొందరు తొలిరోజు ఒక్కో సెట్ సమర్పించారు. కాగా, బరిలో నిల్చునే అభ్యర్థుల్లో ఎక్కువమంది ఈనెల 9వ తేదీనే నామినేషన్ వేసేందుకు ముహూర్తం నిర్ణయించుకున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఖమ్మం రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

పోలీస్ పహారా..

ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగానే శుక్రవారం ఉదయం 11గంటల నుంచి జిల్లాలో ఐదు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. అన్ని కార్యాలయాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేయడమే కాక నిర్ణీత సంఖ్యలో నాయకులు, వాహనాల అనుమతికి సిద్ధమయ్యారు.

తొలిరోజు ఖమ్మంలో మూడు, పాలేరులో రెండు

- మంచి ముహూర్తం కావడంతో ఒక్కో సెట్ దాఖలు
- వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో నిల్
- ఎక్కువ మంది 9వ తేదీన దాఖలు చేసేలా ఏర్పాట్లు

తుమ్మల ఒక సెట్ ..

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ ఖమ్మం నియోజకవర్గానికి ఒక సెట్ నామినేషన్ వేశారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇతర నేతలతోకలిసి ఆయన ఆర్‌ఓ ఆదర్శ్‌సురభికి నామినేషన్ అందజేశారు. గడువు ముగిసేలోగా పార్టీ శ్రేణులతో ర్యాలీగా వచ్చి మరో సెట్ నామినేషన్ వేయనున్నారు. అలాగే, ఇండిపెండెంట్‌గా కొంకిమల్ల సాయికుమార్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కాటేపల్లి శైలజ కూడా నామినేషన్లు సమర్పించారు. ఇక పాలేరు నియోజకవర్గానికి ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున పసుపులేటి శ్రీనివాస రావు, ఇండిపెండెంట్‌గా బుడగజంగం సాయిలు నామినేషన్లు దాఖలు చేయగా, మిగతా మూడు నియోజకవర్గాల్లో ఒక్కటీ దాఖలు కాలేదు.

నామినేషన్లైతే వేద్దాం ..

పలు పార్టీల నుంచి టికెట్ ఆశించి భంగపడిన, ఇంకా టికెట్ ప్రకటించని నియోజకవర్గాల్లో తమకే టికెట్ వస్తుందనుకుంటున్న ఆశావహులంతా ముందుగా నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. టికెట్ రాకపోతే తమను బుజ్జగించడం, ఆతర్వాత పార్టీ అభ్యర్థి గెలిచి, ప్రభుత్వం వస్తే ఏదైనా పదవులు వస్తాయన్న కోణంలో ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఏ పార్టీ నుంచి ఎంత మంది రెబల్స్ నామినేషన్లు వేస్తారనేది తేలాల్సి ఉంది. ఎక్కువ మంది రెబల్స్ ఒకే పార్టీ నుంచి ఉంటే వారిని అభ్యర్థులు బుజ్జగించడం తక్కువ సమయంలో కష్టమేనేనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ టికెట్ దక్కని, టికెట్ కోసం వేచి చూస్తున్న వారు మాత్రం నామినేషన్ వేస్తేనే తమ ప్రాధాన్యత పార్టీకి తెలుస్తుందన్న భావనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

భద్రాద్రి జిల్లాలో మూడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు గాను తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులు గుండపనేని సతీష్, ఇమంది ఉదయ్‌కుమార్, ఇల్లెందు నుంచి స్వతంత్ర అభ్యర్థి పోలెబోయిన రవి నామినేషన్ వేశారు. ఇక భద్రాచలం, అశ్వారావుపేట, పినపాకలో నామినేషన్లు దాఖలు కాలేదు.

కేసీఆర్ వేసిన రోజే..

జిల్లాలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు సీఎం కేసీఆర్ నామినేషన్ వేయనున్న ఈనెల 9వ తేదీన చివరి సెట్ దాఖలకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. ముందుగా ఒక సెట్ నామినేషన్ వేసి.. చివరిరోజు వరకు ర్యాలీగా మరో సెట్ సమర్పించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈనెల 9న నామినేషన్ వేయనున్నట్లు ఇప్పటికే సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య ప్రకటించారు. తమ పేరు బలం, గతంలో ఏ దేవాలయంలో పూజ చేసి నామినేషన్ వేస్తే విజయం వరించిందో మళ్లీ అదే సెంటిమెంట్ పాటించేందుకు సిద్ధమవుతున్నారు.

జంగ్ తెలంగాణ

కాంగ్రెస్ గెలుపు అత్యంత ఆవశ్యం

- ఆధునిక ఖమ్మం కోసం కృషి చేస్తా
- మాజీ మంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం ఆర్‌ఓ ఆదర్శ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లాకు కాంగ్రెస్ పార్టీ గెలుపు అత్యంత ఆవశ్యకమని మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శుక్రవారం ఆయన ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం తుమ్మల మీడియాతో మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గ ప్రజల అవసరాలు తీర్చేందుకు, వారి మనోభావాలను కాపాడి గౌరవం, ప్రతిష్టను ఇనుమడింపచేసేందుకు తన శాయశక్తులా పనిచేస్తానని పేర్కొన్నారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల అవసరాల ఆధారంగా, ఆధునిక ఖమ్మం ఏర్పాటు కోసం పనిచేస్తానని తెలిపారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించి నీతివంతమైన, ప్రజాహితమైన పాలన అందించేందుకు అండగా నిలవడమేకాక తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ సంతోషపడేలా ఆశీర్వదించాలని కోరారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి రాగానే అమలుచేస్తామన్నారు. అప్రజాస్వామిక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మలీదు వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం ఎంపీపీ భూక్యా గౌరి, తుమ్మల యుగేంధర్ తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం.. వాస్తు!

తుమ్మల నాగేశ్వరరావు ఉదయం 10.50 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి ఉత్తరం వైపు రోడ్డు మార్గంలో బయల్దేరారు. వేణుగోపాల్ నగర్‌లోని హన్మంతుడి ఆలయంలో పూజలు చేశాక తూర్పు రోడ్డుగా బయలుదేరి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా కేఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. 11.08 గంటలకు ఆర్‌ఓ కార్యాలయంలోనికి ప్రవేశించిన ఆయన ముందుగా నిర్ణయించుకున్న 11.40 గంటల ముహూర్తానికే నామినేషన్ సమర్పించారు.

అక్రమ మద్యం నియంత్రణపై దృష్టి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీసీ జనార్దన్‌రెడ్డి

సత్తుపల్లిటౌన్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం, నాటు సారా రవాణా జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. సత్తుపల్లి పరిధిలోని మేడిశెట్టివారిపాలెం, వెంకటాపురం, ముత్తగూడెం, పేరువంచ ఎక్సైజ్ చెక్‌పోస్టులను ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.నాగేంద్ర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ అక్రమంగా మద్యం, నాటుసారా కలిగి ఉన్నా, అమ్మినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ వి.రాజశేఖర్‌రావు, ఎస్సై అల్లూరి సీతారామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బు, అధికారంతో విర్రవీగుతున్నారు..

- కాంగ్రెస్ అధికారాన్ని ఎవరూ అడ్డుకోలేరు
- పాలేరు అభ్యర్థి, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి

కూసుమంచి: ఆరు దశాబ్దాలుగా తెలంగాణ కోసం జరుగుతున్న పోరాటం, ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకుని రాజకీయంగా నష్టం ఎదురవుతుందని తెలిసినా సోనియమ్మ తెలంగాణ ఇస్తే.. తానే సాధించానని ప్రజల్ని నమ్మించి రెండు సార్లు అధికారం చేపట్టిన కేసీఆర్ కుటుంబం ప్రజాధనాన్ని దోచుకుందని టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కూసుమంచి మండలంలోని మునిగేపల్లి, నేలపట్ల, అగ్రహారం, లోక్యాతండా, కోక్యాతండా, పోచారం, ముత్యాలగూడెం, చేగొమ్మ, కేశ్వాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా కేసీఆర్ పాలన సాగిస్తూ.. అధికారం, డబ్బుతో విర్రవీగుతున్నారని మండిపడ్డారు. ఏదిఏమైనా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని.. కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితం కావడం ఖాయమని తెలిపారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌దే గెలుపునే నిర్ణయానికి వచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ దోచుకున్న డబ్బుతో అధికారంలోకి రావాలని చూస్తున్నారని, వారు ఇచ్చే డబ్బు తీసుకుని కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలవుతాయని పొంగులేటి తెలిపారు. కాగా, ప్రచారానికి వచ్చిన శ్రీనివాసరెడ్డికి ఆయా గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, కొరివి వెంకటరత్నంతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా గ్రామాలకు వచ్చిన పొంగులేటి సమక్షాన బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. మునిగేపల్లి ఉపసర్పంచ్ మల్లెల ఉపేందర్, వార్డుసభ్యులు వీరబాబు, సావిత్రి, సత్యనారాయణ, పెరికిసింగారానికి చెందిన తిప్పని సరోజిని తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.



ముత్యాలగూడెంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి తదితరులు



పొంగులేటి ప్రచార ర్యాలీలో భారీగా పాల్గొన్న మహిళలు

ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న మంత్రి అజయ్‌కుమార్ పక్కన ఎంపీ నాగేశ్వరరావు



సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- మైదానాన్ని పరిశీలించిన మంత్రి పువ్వాడ, ఎంపీ నామ
- ఏర్పాట్లలో వేగం పెంచాలని సూచనలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం జరగనున్న ప్రజా ఆశీర్వాద సభకు పకడ్బందీ ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ఈమేరకు సభ ఏర్పాట్లను ఎంపీ నామ నాగేశ్వరరావుతో కలిసి శుక్రవారం మంత్రి పరిశీలించారు. వేదిక, సీట్లు, పార్కింగ్, సభకు వచ్చివెళ్లే మార్గాలు తదితర అంశాలపై చర్చించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అలాగే, పోలీసు అధికారులతో కలిసి మ్యాప్ ఆధారంగా చర్చించి ఎలాంటి తోపులాట, ఇతరత్రా ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు గుండాల కృష్ణ, కర్నాటి కృష్ణ, పగడాల నాగరాజు, అమరగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ పాయింట్!



సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగుతున్న ఆదర్శ్ సురభి

ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు గాను ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద శుక్రవారం సెల్ఫీ పాయింట్ ఏర్పాటుచేశారు. 'ఐ విల్ ఓట్ బికాస్ ఐ లవ్ ఖమ్మం' నినాదంతో ఏర్పాటుచేసిన ఈ పాయింట్‌ను కేఎంసీ కమిషనర్, రిటర్నింగ్ ఆఫీసర్ ఆదర్శ్ సురభి ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. డబ్బు, మద్యం తదితర ప్రలోభాలకు లొంగకుండా నైతికతతో ఓటు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి, జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మం మయూరిసెంటర్

వ్యయ పరిశీలనే కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన పరిశీలకులు, అధికారులు

- అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- ప్రత్యేక బృందాల సమీక్షలో వ్యయ పరిశీలకుల సూచన

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల వ్యయాన్ని పరిశీలించడమే కీలకమని వ్యయ పరిశీలకులు కునాల్‌కుమార్, రాజీవ్‌కుమార్ సింగ్ తెలిపారు. జిల్లాకు కేటాయించిన అధికారులిద్దరు శుక్రవారం ఖమ్మం వచ్చారు. వీరిలో కునాల్‌ను ఖమ్మం, పాలేరుకు, రాజీవ్‌కుమార్ వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి నిఘా బృందాలు, అకౌంటింగ్ బృందాలతో సమావేశమయ్యారు. తొలుత ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో, అకౌంటింగ్ బృందాల పనితీరును కలెక్టర్ వివరించారు. ఆతర్వాత కునాల్, రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ముఖ్యమని తెలిపారు. అభ్యర్థుల ఖర్చు విషయమై రిజిస్టర్లు నిర్వహించాలని, ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై నివేదిక సమర్పించాలని సూచించారు. తొలుత కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్, 1950 టోల్ ఫ్రీ నెంబర్, సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులు, పరిష్కారం వివరాలు ఆరా తీశారు.



కంట్రోల్ రూమ్‌లో సీసీ టీవీ ఫుటేజీ పరిశీలిస్తున్న అధికారులు

విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో సమావేశమై మాట్లాడుతూ ఎన్నికల విధులు కీలకమయినవని, ఏ దశలోనూ అలసత్వం వహించొద్దని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి కిట్లు సమకూర్చాలని, సామగ్రి రవాణాకు వాహనాలు సిద్ధం చేయాలని చెప్పారు. ప్రతీ పంచాయతీ కార్యదర్శి కనీసం 50 మందితో సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేయించేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈసమావేశాల్లోఅదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, వ్యయ పరిశీలన జిల్లా నోడల్ అధికారి, డీసీఓ విజయకుమారి, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, ఐటీ నోడల్ అధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలో శుక్రవారం మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

న్యూస్‌రీల్

జిల్లా న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి

ఖమ్మంలీగల్: ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.అమరావతికి పదోన్నతి లభించింది. ఆమెకు జిల్లా న్యాయాధికారిగా పదోన్నతి కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో 15మంది సీనియర్ సివిల్ జడ్జిలకు జిల్లా న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించగా, జాబితాలో అమరావతికి స్థానం దక్కింది.

10వరకు ఇంటర్‌లో ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రవేశానికి ఈనెల 10వ తేదీ వరకు అవకాశముందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కళాశాల్లో ఎలాంటి అపరాధ రుసుం ఉండదని, ప్రైవేట్ కళాశాలల్లోనైతే రూ.2వేల ఆలస్య రుసుంతో అడ్మిషన్ పొందొచ్చని పేర్కొన్నారు. ఇదే చివరి అవకాశమైనందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, జిల్లాలో ట్యూషన్ పాయింట్లు, అకాడమీలకు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతి లేదని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి గుర్తింపు పొందిన కళాశాలల్లోనే ప్రవేశాలు పొందాలని డీఐఈఓ తెలిపారు.

17లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులు ఈనెల 17వ తేదీలోగా ఫీజు చెల్లించాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. అయితే, రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 1వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో వచ్చే నెల 11వ తేదీ వరకు, రూ.500 ఫైన్‌తో వచ్చే నెల 20వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎంపీహెచ్‌ఏ ట్రైనింగ్ స్కూల్‌లో ప్రవేశాలు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఎంపీహెచ్‌ఏ ట్రైనింగ్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ మాలతి తెలిపారు. ఇంటర్, తత్సమాన కోర్సులు పూర్తిచేసిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తును చేసుకుని, ప్రతిని ప్రభుత్వ ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రైనింగ్ స్కూల్‌లో అందజేయాలని సూచించారు.


'సీస్' పరీక్ష తనిఖీ చేసిన డీఈఓ



పరీక్ష హాల్‌లో పరిశీలిస్తున్న డీఈఓ శర్మ

ముదిగొండ: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించేందుకు ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యాన శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎస్‌ఈఏఎస్) పరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలోని 854 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 20 మంది 3, 6, 9వ తరగతుల విద్యార్థులు పరీక్ష రాశారు. ఈమేరకు ముదిగొండ మండలం బాణాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షను డీఈఓ సోమశేఖరశర్మ పరిశీలించారు. అలాగే, పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఈఏఎస్ క్షేత్రస్థాయి పరిశీలకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు, వర్షంతో వరి పైరుకు నష్టం



కోతకొచ్చిన వరి పైరు నేలకొరిగిన దృశ్యం

తల్లాడ: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కోతకొచ్చిన వరి పైరు నేలవాలిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో పది రోజుల్లో కోతకొస్తుందని భావిస్తుండగా.. అకస్మాత్తుగా గాలులు, వర్షంతో పైరు నేల వాలగా రైతులకు నష్టం వాటిల్లినట్లయింది. అయితే, ముందు పంట వేసిన వారికి నష్టం ఎదురుకాగా.. లేత వరి పైరుకు మాత్రం ఈ వర్షం ఉపకరిస్తుందని చెబుతున్నారు. మండలంలోని రేజర్ల, బిల్లుపాడు, కొత్త వెంకటగిరి, మిట్టపల్లి, నూతనకల్, రంగంబంజర, మల్సూర్ తండా గ్రామాల్లో వర్షం కురిసింది.

క్లుప్తంగా

కడసారి చూపునకు వచ్చి కన్నుమూత




విజయకుమారి (ఫైల్) సునీత (ఫైల్)

వేంసూరు: మేనత్త మృతి చెందడంతో కడసారి చూసేందుకు వచ్చిన మహిళ గుండెపోటుతో మృతి చెందిన ఘటన వేంసూరు అంబేడ్కర్ కాలనీ శుక్రవారం చోటు చేసుకుంది. వేంసూరుకు చెందిన రామాల విజయకుమారి(55) గురువారం గుండెపోటుతో మృతి చెందగా హైదరాబాద్‌లో నివాసముంటున్న ఆమె మేన కోడలు సునీత(45) తన భర్త రవికుమార్‌తో కలిసి శుక్రవారం వచ్చింది. మేనత్త మృతదేహం వద్ద రోదిస్తుండగానే సునీతకు గుండెపోటు రావడంతో సత్తుపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాలనీకి చెందిన ఇద్దరు రోజు తేడాతో మృతి చెందడం, ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

డ్రమ్ము పేలి, బ్లేడ్ ముక్కలై కార్మికుడు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని పాన్నేకల్‌లో గల భార్గవ్ ప్లాస్టిక్ కంపెనీలో ప్రమాదవశాత్తు ప్లాస్టిక్ డ్రమ్ము పేలడంతో బీహార్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు తుంటూన్‌సింగ్(35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రంలోని బోజుపూర్ జిల్లా మినయాస్‌కు చెందిన తుంటూన్ ఐదేళ్లుగా ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం పనిలో భాగంగా ఆయన ఫ్యాక్టరీలో ప్లాస్టిక్ డ్రమ్మును మిషన్‌పై బ్లేడ్ సాయంతో కట్ చేస్తుండగా, ఒత్తిడికి డ్రమ్ము పేలి ఇనుప బ్లేడ్ ముక్కలై ఛాతి, ఎడమ భుజం, చేతులు, కాళ్ల మడిమలకు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఫ్యాక్టరీ యజమాని దగ్గుల లక్ష్మారెడ్డి కనీస జాగ్రత్తలు తీసుకోకుండా కార్మికులతో పని చేయించడంతోనే తుంటాన్ మృతి చెందాడని ఆయన బంధువు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

ట్రాక్టర్ డోర్ ఊడి పడి కూలీలకు గాయాలు

నేలకొండపల్లి: పత్తి తీసేందుకు ట్రాక్టర్‌లో కూలీలు వెళ్తుండగా, ట్రక్కు తలుపు ఊడిపడి ఇద్దరు కార్మికులు కింద పడడంతో గాయపడ్డారు. మండలంలోని సదాశివాపురానికి చెందిన 20 మంది కూలీలు అనాసాగారంలో పత్తి తీసేందుకు రోజు మాదిరిగానే శుక్రవారం ట్రాక్టర్‌లో బయలుదేరారు. కాసేపటికే స్పీడ్‌బ్రేకర్ల వద్ద ట్రాక్టర్ వెనక డోర్ ఊడిపోయింది. దీంతో అందులో ఉన్న జిల్లపల్లి భారతి, జిల్లపల్లి లక్ష్మి రోడ్డుపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

నాటుసారా సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

కారేపల్లి: ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో నాటుసారా తరలిస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు. కారేపల్లి ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ వెల్లడించిన వివరాలు.. భద్రాద్రి జిల్లా టేకులపల్లికి చెందిన బాలు ద్విచక్రవాహనంపై శుక్రవారం సారా తీసుకెళ్తుండగా జైత్రాం తండా గ్రామం వద్ద గుర్తించారు. ఆయన నుంచి 20 లీటర్ల నాటుసారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. అలాగే, కారేపల్లి మండలంలోని వివిధ గ్రామాల బెల్ట్‌షాపుల్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టి 125 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు ఢీకొట్టడంతో 15 గొర్రెలు మృతి

బోనకల్: మండలంలోని కలకోట – బ్రాహ్మణపల్లి ప్రధాన రహదారిపై వెళ్తున్న గొర్రెలను కారు ఢీకొట్టడంతో మృతి చెందాయి. రహదారి మీదుగా శుక్రవారం రాత్రి బ్రాహ్మణపల్లికి చెందిన వంగల వంశీ గొర్రెలను తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో వైరా నుండి మధిర వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో 15 జీవాలు మృతి చెందాయి. అయితే, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కారు ఆపకుండా వెళ్లడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కృష్ణాపురం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

34కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్ స్టేషన్–2 సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యాన శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బీహార్‌కు చెందిన అభియాకుమార్‌నాయక్ రూ.5లక్షల విలువైన సుమారు 21 కేజీల ఎండు గంజాయితో హైదరాబాద్ వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో ఎస్సైలు సరిత, సందీప్, ఉద్యోగులు నాయక్ నరేందర్, మౌలాంకార్, నర్సింహ, వీరభద్రం, గురుప్రసాద్, చెన్నమ్మ పాల్గొన్నారు. కాగా, ఖమ్మం వన్‌టౌన్ ప్రాంతంలో ఒడిశాకు చెందిన కేశవ్ ప్రధాన్ గంజాయితో వెళ్తుండగా అరెస్ట్ చేశామని సీఐ స్వామి తెలిపారు. ఆయన నుంచి రూ.3.25లక్షల విలువైన 13కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,231

వేగంగా.. సులభంగా !



- ఎన్నికల సమగ్ర సమాచారం అరచేతిలో..
- అందుబాటులో ప్రత్యేక యాప్‌లు

భద్రాచలంఅర్బన్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానం తోడు కానుంది. నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 8న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. వేగంగా సులభంగా క్షణాల్లో సమాచారం తెలుసుకునేలా, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పలు వెబ్‌సైట్లు, యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటరు నమోదు నుంచి పోలింగ్ వరకు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవచ్చు.

ఓటర్ హెల్ప్‌లైన్

ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా పొందొచ్చు. నూతన ఓటరు నమోదు తోపాటు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. మన పేరు ఎలక్టోరల్ జాబితాలో నమోదైందో, లేదో వెతకవచ్చు. అంతేకాక ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటు వేసే పోలింగ్ కేంద్రంతోపాటు పోటీ చేసే అభ్యర్థి, సమాచారం వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. అంతేకాక ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులకు కూడా ఈ యాప్ ద్వారా అవకాశం కల్పించారు.

కేవైసీ..

అభ్యర్థుల సమాచారం తెలుసుకునేలా నో యువర్ క్యాండిడేట్ అనే పేరిట ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా యాప్ రూపొందించింది. ఈ యాప్ ద్వారా అభ్యర్థులు ఫొటో, వివరాలు, వారిపై ఉన్న క్రిమినల్ కేసులు, నామినేషన్ పత్రాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది.

సుగమ్

ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులు ప్రచారానికి వాహనాలు వినియోగిస్తుంటారు. వీటికి అనుమతి కోసం సుగమ్ పేరిట యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అభ్యర్థుల ప్రచారం సందర్భంగా రెండు వాహనాలు వినియోగించాలి. సభలు, సమావేశాల కోసం మరో నాలుగు వాహనాల కోసం ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలి. నియమావళికి విరుద్ధంగా వినియోగిస్తే అధికారులు సీజ్ చేస్తారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు వివరాలను పరిశీలించిన అనంతరం అనుమతులు జారీ చేస్తారు.

సక్షం

దివ్యాంగ ఓటర్ల కోసం సక్షం యాప్ తోడ్పాటు అందిస్తుంది. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యాప్ రూపొందించారు. ఈ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. మార్పుచేర్పులు, తొలగింపునకు అవకాశం ఉంది. ఓటర్ల జాబితాలో పేరు తెలుసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాల వివరాలు బూత్ లొకేటర్ వంటివి పొందుపర్చారు. వీల్‌చైర్, పికప్ అండ్ డ్రాప్ కోసం అభ్యర్థించవచ్చు. ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చు. యాప్‌లో రిజిస్ట్రేషన్, ఫెసిలిటీస్, సెర్చ్, ఇన్ఫర్మేషన్ అండ్ కంప్లైంట్ ఆప్షన్లు కనిపిస్తాయి.

ఈ ఎస్‌ఎంఎస్ 2.0

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తుంటారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదు, ఇతర వస్తువులను సీజ్ చేస్తుంటారు. వీటి వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు ఈ ఎస్‌ఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా ఎంత మొత్తంలో నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారనే విషయాలు ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది.

ఒకే ఒక్కరు!




కుంజా సత్యవతి



ముర్ల ఎర్రయ్యరెడ్డి



కుంజా బొజ్జి



- భద్రాచలంలో ఏకైక మహిళా ఎమ్మెల్యే
- కొండరెడ్లు.. హ్యాట్రిక్ ఎమ్మెల్యే కూడా ఒక్కొక్కరే

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గం 1952లో ఆవిర్భవించగా ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పలువురు మహిళా అభ్యర్థులు పోటీ పడినా విజయం మాత్రం ఒకరినే వరించింది. 2009 ఎన్నికల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యాన కాంగ్రెస్ తరపున పోటీ చేసిన కుంజా సత్యవతి తన ప్రత్యర్థి, సీపీఎం అభ్యర్థి సున్నం రాజయ్యపై గెలిచారు. అలాగే, 1989, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి దుంగురౌతు సుశీల, 2014లో టీడీపీ తరపున ఫణీశ్వరమ్మ పోటీ చేయగా విజయం దక్కలేదు. వీరేకాకుండా పలు ఎన్నికల్లో ఇండిపెండెంట్లుగా మహిళా అభ్యర్థులు బరిలోకి దిగినా వెయ్యి లోపు ఓట్లకే పరిమితమయ్యారు.

ఒకే ఒక్క కొండరెడ్డి ఎమ్మెల్యే

16 సార్లు జరిగిన ఎన్నికల్లో భద్రాచలం ఎమ్మెల్యేగా కొండరెడ్డి జాతి నుంచి ఒకరే ప్రాతినిధ్యం వహించారు. కొండరెడ్డి జాతికి చెందిన ముర్ల ఎర్రయ్యరెడ్డి 1978లో సీపీఎం తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పి.తిరుపతయ్యపై గెలిచారు. 1983లో మళ్లీ రెండోసారి టీడీపీ అభ్యర్థి అశ్వపతిపై విజయం సాధించారు. దీంతో నియోజకవర్గం నుంచి ఏకైక కొండరెడ్డి ఎమ్మెల్యేగా ఎర్రయ్యరెడ్డి పేరిట రికార్డు నమోదైంది.

హ్యాట్రిక్ కూడా ఒకరికే..

భద్రాచలం నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం ఒకేసారి నమోదైంది. సీపీఎంకు చెందిన కుంజా బొజ్జి పేరిట ఈ రికార్డు ఉంది. ఆయన 1985, 1989, 1994లో వరుసగా పోటీ చేసి గెలుపొందారు. అలాగే, సీపీఎం అభ్యర్థి సున్నం రాజయ్య మూడు సార్లు గెలిచినా వరుసగా విజయాలు దక్కలేదు.

తొలి నామినేషన్.. తొలి దరఖాస్తు

ఖమ్మం కాంగ్రెస్ నుంచే నమోదు



తుమ్మల నాగేశ్వరరావు



కోటూరి మానవతారాయ్

సత్తుపల్లి: అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం మొదలైంది. కాంగ్రెస్ రాష్ట్రంలోని పలు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించగా.. మరికొన్నింటికి ఇంకా ఖరారు చేయలేదు. అయితే, ఖమ్మం అభ్యర్థిగా ఇప్పటికే వెల్లడించిన తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. దీంతో రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయనే తొలి నామినేషన్ దాఖలు చేసినట్లయింది. కాగా, కాంగ్రెస్ టికెట్ల ఖరారుకు ముందు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో భాగంగా సత్తుపల్లి టికెట్ ఆశిస్తూ ఆగస్టు 18న కోటూరి మానవతారాయ్ గాంధీభవన్‌లో తొలి దరఖాస్తు అందజేశారు. ఇలా కాంగ్రెస్ టికెట్ కోసం తొలి దరఖాస్తు, తొలి నామినేషన్ ఖమ్మం జిల్లా నుంచే నమోదు కావడం విశేషం. అయితే, మానవతారాయ్‌కు టికెట్ మాత్రం ఇంకా ఖరారు కాలేదు.

పేదల అభివృద్ధి... కేసీఆర్ బాధ్యత

పాలేరు ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం 24గంటల పాటు తపించే ఏకైక సీఎం ఒక్క కేసీఆర్ మాత్రమేనని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తకొత్తూరు, తిరుమలాపురం, ఆజయ్‌తండా, రాజారాంపేట, మోతాపురం, కట్టుకొమ్ముతండా, శంకరగిరితండా, రాజేశ్వరపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో కందాళ మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వాన అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌ను మరోమారు ఆదరించాలని కోరారు. అలాగే, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న తనను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం నేలకొండపల్లి క్యాంపు కార్యాలయంలో 35 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షాన బీఆర్‌ఎస్‌లో చేరాయి. జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, మార్కెట్ చైర్మన్ శాంత పాల్గొన్నారు.



రాజారాంపేటలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

ఉరుకులు.. పరుగులు!



ఎంపీపీ గౌరిని ద్విచక్రవాహనంపై కూర్చోపెట్టి పరుగు పెడుతున్న మురళి



గౌరిని కార్యాలయంలోకి తీసుకెళ్తూ...

ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు కేఎంసీలోని రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ దాఖలు చేయగా, కొంత ఉత్కంఠ చోటు చేసుకుంది. తుమ్మల అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించాల్సిన రఘునాథపాలెం ఎంపీపీ భూక్యా గౌరి కాస్త ఆలస్యంగా చేరుకున్నారు. అప్పటికే తుమ్మల తదితరులు ఆర్‌ఓ కార్యాలయంలోకి వెళ్లగా, ఆ తర్వాత వచ్చిన గౌరిని 100 మీటర్ల అవలే పోలీసులు నిలిపేశారు. ఇంతలోనూ ముహూర్తం సమీపించడంతో కార్పొరేటర్ కమర్తపు మురళి హడావుడిగా బయటకు వచ్చి ఆమెను ద్విచక్ర వాహనంపై కార్యాలయంలోకి తీసుకెళ్లారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

పర్వతారోహణకు బయలుదేరిన మోతీకుమార్



మోతీకుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న గ్రామస్తులు

పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీం బంజర్ సోమ్లానాయక్ తండాకు చెందిన పర్వతారోహితుడు బర్మావత్ మోతీకుమార్‌కు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రపంచంలోనే రెండో అతిపెద్దదైన శిఖరం అధిరోహించడానికి రష్యా దేశానికి పయనమయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయనను సన్మానించిన స్థానికులు.. పర్వతంపై జాతీయ జెండాను ఎగురవేసి భారత ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యుడు చలమాల నర్సింహారావుతో పాటు బెజవాడ సాయిశేషు, శివ, వంశీ, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'సంకల్ప' సేవలు అభినందనీయం



చిన్నారికి మందులు అందజేస్తున్న డీఎం శ్రీనివాస్

ఖమ్మంవైద్యవిభాగం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తలసేమియా బాధిత చిన్నారుల కోసం 14 ఏళ్లుగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సేవ లందించడం అభినందనీయమని ఆర్టీసీ ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. ఖమ్మంలోని రితన్య ఆస్పత్రి తలసేమియా డే కేర్ సెంటర్‌లో సంకల్ప ఆధ్వర్యానఆయన శుక్రవారం చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ చిన్నారులకు ఇలా సేవ చేస్తున్న సంస్థలు తక్కువగా ఉంటాయని, ఇందులో జిల్లా నుంచి సంకల్ప సంస్థకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మాధవరావు మాట్లాడగా, డాక్టర్ డి.నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాస్‌తో పాటు పి.పావని, ప్రొద్దుటూరి రవిచందర్, పి.అనిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా జట్లు ఎంపిక



అండర్–17 హ్యాండ్‌బాల్ బాలికల జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా జట్లను ఎంపిక చేశారు. అండర్–18 బాలబాలికల హ్యాండ్‌బాల్, అండర్–14, 17 బాలబాలికల టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో జరిపిన ఎంపిక పోటీలకు రెండు జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ ఎంపిక పోటీలను డీఈఓ సోమశేఖరశర్మ పర్యవేక్షించగా, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.నర్సింహారావు, కోచ్ ఓలేటి సాంబమూర్తి, పీడీ, పీఈటీలు పి.శ్రీనివాస్, కృష్ణయ్య, జి.సైదేశ్వరరావు, కృష్ణ, వీరరాఘవయ్య, నాగుల్ మీరా, అన్నపూర్ణ, హర్షిత పాల్గొన్నారు.

జట్లు ఇవే..

ఉమ్మడి జిల్లా బాలుర హ్యాండ్‌బాల్ జట్టుకు వీఎస్ దీపక్, శివకుమార్, విఘ్నేశ్, లక్ష్మణ్‌రావు, తరుణ్, అబ్దుల్, హమీద్, పి.నోహస్, అభిషేక్, భార్గవ్, వంశీమోహన్, సంజీవ్, ఇమ్రాన్, అజయ్, ప్రదీప్, రాంచరణ్ ఎంపికయ్యారు. అలాగే, బాలికల జట్టుకు ఉషశ్రీ, నేహ, రాజ్యలక్ష్మి, పి.సింధు, జె.సౌమ్య, ఈ.అక్షర, ధాత్రి, ఎం.అస్మిత, సాత్విక, ఉమారాణి, సింధు, పూజిత, మహేశ్వరి, మార్గశ్రీని ఎంపిక చేశారు. ఇక అండర్–17 బాలికల వెయిట్ లిఫ్టింగ్‌లో పల్లవి, తనుశ్రీ, బిందు, భార్గవి, వర్షిత, ప్రసన్న, అనుష్క, సాత్విక, మోహన, శ్రీవిద్య, భువనేశ్వరి ఎంపిక కాగా, బాలుర విభాగం నుంచి సాయివిశాక్, శ్రీకాంత్, శ్యామ్, తరుణ్‌జోష్, ఉదయ్, వంశీ, శరత్‌చంద్ర, చేతన్, భరత్, గోపిని ఎంపిక చేసినట్లు డీఈఓ తెలిపారు. ఇంకా టేబుల్‌టెన్నిస్ అండర్–14, 17 బాలుర జట్టుకు పి.జ్వలిత్, జి.చార్విక్, ఎ.ఉజ్వల్, కె.హితేష్, ఈ.హరి, పి.మోహన్‌కృష్ణ, ఎస్.కే.ఖలీల్ పాషా, టి.గోపీచంద్, ఎస్.రాధాకృష్ణసాయి, ఎస్.కే.ఫజల్, బాలికల జట్టుకు సీహెచ్.శరణ్య, కె.స్పందనచంద్ర, బి.శివాని, కె.వర్షిత, డి.సంగీత, ధరణి, జి.చంద్రిక, జి.సిరి, నవ్య, జాహ్నవి ఎంపికయ్యారని వెల్లడించారు.

జూనియర్ కళాశాలల జట్లు..

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్–19 అథ్లెటిక్స్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈపోటీలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ మేరకు అథ్లెటిక్స్ జిల్లా బాలికల జట్టుకు బి.వైశాలి, గోర్లియా, కోనమ్మ, రోహిణి, భవ్య మహిత, సంధ్య, భావన, బాలుర జట్టుకు అభినవ్‌నాయక్, వివేక్‌చంద్ర, అఖిల్‌ప్రేమ్‌కుమార్, జె.వరుణ్, సాత్విక్, సిద్ధి వినాయక, రవీందర్‌ను ఎంపిక చేశారు. అలాగే, టేబుల్ టెన్నిస్ బాలుర జట్టుకు అఫ్నాన్, ఆనస్, రాధాకృష్ణసాయి ఎంపిక కాగా, ఆర్చరీ బాలుర జట్టుకు ఇరప్ప ప్రతాప్, నరసింహరాజ్, బాలికల జట్టుకు కె.అనూష ఎంపికయ్యారు. పోటీలను కోచ్‌లు ఎండీ గౌస్, షఫీక్ అహ్మద్, ఓలేటి సాంబమూర్తి, నగేశ్ పర్యవేక్షించారని క్రీడల కార్యదర్శి ఎండీ మూసాకలీం తెలిపారు.

చెరువు నుంచి దిగువకు నీరు



చెరువు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు ఖాళీ అవుతోంది. నీటిమట్టం క్రమంగా తగ్గుతుండడంతో స్థానిక రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ చెరువు ఆయకట్టు కింద మంగాపురం, చెరువుమాధారం, రాయగూడెం గ్రామ రైతుల పొలాలు ఉండగా, దిగువ కెనాల్‌కు భారీగా నీరు వెళ్తోంది. సదరు కెనాల్ పరిధిలోని కొందరి నుంచి స్థానిక అక్రమార్కులు డబ్బు తీసుకుని నీటిని విడుదల చేస్తున్నారనే విమర్శలున్నాయి. అయితే, భారీగా నీరు వెళ్తూ చెరువు అవుతుండడంతో రైతులు గస్తీ కాస్తున్నారు. ఈవిషయమై ఇరిగేషన్ డీఈఈ మన్మధరావును వివరణ కోరగా విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడమేకాక ఇరిగేషన్ సిబ్బందిని గస్తీ ఏర్పాటు చేశామని తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలుశిక్ష

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామంలో పొలం గెట్టు విషయమై తగాదా జరగగా, ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ఇద్దరికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె.ఆశారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. 2018 జూలై 26న మధ్యాహ్నం గ్రామానికి చెందిన పి.సైదులు పొలం గెట్టును జుజారి లింగయ్య, జుజారి దున్నారు. ఇదేమిటని అడగగా వారిద్దరు సైదులును దుర్భాషలాడడమే కాక గొడ్డలితో గాయపరిచారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా నిందితులపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఎం.డి.ఇర్షాద్ వాదించగా ఎల్.భద్రునాయక్, ఓ.శ్రీనివాసరావు సహకరించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

కారేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన క్షణికావేశంలో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని వెంకిట్యాతండా గ్రామానికి చెందిన బాదావత్ కాంతి ఇంట్లో గురువారం కుటుంబ సభ్యులతో చిన్న వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆమె పురుగుల మందు తాగగా, గమనించిన కుటుంబీకులు కాంతిని కారేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!



గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధపడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటువ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.



● **తగినంత నిద్ర**

నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● **ఫ్లూ టీకాలు**

ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.



● **పరిశుభ్రతను పాటించడం**

ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● **తగినంత దూరం పాటించడం**

తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

లైఫ్@360

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.

* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.

* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్లలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.

* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్లను తాగితే ఫలితం ఉంటుంది.

* రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.


* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.

* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.

* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1996)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ' సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.